క్లుప్తంగా

వికసించిన బ్రహ్మకమలం



పుష్పాలకు మంగళహారతులు పడుతున్న మహిళలు

కొడంగల్ రూరల్: పాత బస్టాండు సమీపంలోని ఉపాధ్యాయురాలు రత్నకళ ఇంట్లో గురువారం రాత్రి బ్రహ్మకమలం పుష్పాలు వికసించాయి. దీంతో ఆ పువ్వులకు మహిళలు పూజలు చేసి, మంగళహారతులు పట్టారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సంఘం నాయకులు

కుల్కచర్ల: పూలే, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చౌడాపూర్‌లో శుక్రవారం పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. భక్తుల కోరిక మేరకు గుడి నిర్మాణానికి ముందడుగు వేశామని, అందరి సహకారంతో దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో చెన్నయ్య, నర్సింహులు, బాలయ్య, రమేష్, రాములు, ప్రవీణ్, రాజు, శ్రీను, ఆంజనేయులు, నర్సింహులు, రాము, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం జాగ్రత్త



కార్మికులకు రేయిన్ కోట్లు అందజేస్తున్న జీపీ కార్యదర్శి

కుల్కచర్ల: విధి నిర్వహణలో పంచాయతీ కార్మికులు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చౌడాపూర్ పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి సూచించారు. శుక్రవారం జీపీ కార్మికులు వర్షంలో తడవకుండా రేయిన్ కోట్లు, బ్లౌజులు తదితర సామగ్రిని అందజేసి మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికులు వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు ఎప్పటికప్పుడు అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



జీపీ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు

పూడూరు: తమను పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం వారు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గ్రామాల్లో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. కనీస వేతనం 19,500లు పెంచడంతో పాటు అర్హులందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు ముజాహిద్, ఖాజ, బందయ్య, వెంకటయ్య, నాగరాజు, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

కన్నవారిని కడుపులో పెట్టుకోవాలి

ఎంపీడీఓ లక్ష్మప్ప



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న అధికారులు

పెద్దేముల్: కన్నవారిని కడుపులో పెట్టుకొని దైవసమానంగా చుసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మప్ప సూచించారు. పెద్దేముల్ మండలం దుగ్గాపూర్‌లో వృద్ధుడు జాజికార్తీ రాములును భార్య, కుమారులు రోడ్డున పడేశారు. ఎండకు ఎండి, వానకు నాని ఏకాకిగా మిగిలాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్‌సుష్మాలు శుక్రవారం గ్రామానికి వెళ్లి సర్పంచ్ పాషతో పాటు పలువురు గ్రామస్తులు రాములును పరామర్శించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు భార్య భాగ్యమ్మ, కుమారులు తాండూరు మండలం దస్తగిరిలో ఉండటంతో వారిని పిలిపించారు. రాములును జాగ్రత్తగా చూసుకోవాలని, ఆయనను వదిలి వెళ్లరాదని, ఆయన ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు.

పేరుకే పెద్ద ప్రాజెక్టు

ఉమ్మడి జిల్లాకే తలమానికంగా ఉన్న కోట్‌పల్లి జలాశయం.. నిర్వహణ లోపంతో కళతప్పింది. సిబ్బంది కొరత వలన కాలువలు అధ్వానంగా మారాయి. నీరు అందక ఆయకట్టు రైతులు వలస బాట పట్టగా.. భూములు బీడుగా మారాయి. ఫలితంగా వేల ఎకరాలకు నీరందించే ప్రాజెక్ట్ నిరుపయోగంగా మారి.. లక్ష్యం నిరుగారిపోయింది.

కళతప్పిన కోట్‌పల్లి జలాశయం

- సిబ్బంది కరువు.. పాడైన కాలువలు
- ఏటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం



కోట్‌పల్లి ప్రాజెక్టు



శిథిలావస్థలో షటర్లు

పెద్దేముల్: 1967లో మర్రి చెన్నారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో కోటపల్లి ప్రాజెక్టును ప్రారంభించారు. ఐదు దశాబ్దాలు దాటినా.. నేటికీ చివరి భూములకు నీరు అందటం లేదు. 9,200 ఎకరాల ఆయకట్టుకు నీరందించడం జలాశయం లక్ష్యం. కుడి కాలువ ద్వారా 7,200 ఎకరాలు, ఎడుమ కాలువ ద్వారా 2వేల ఎకరాలకు నీరు అందాల్సి ఉంది. ఇది నెరవేరకపోగా క్రమేపి ఆయకట్టు తగ్గుతూ పోతోంది. ప్రస్తుతం 3వేల ఎకరాలకు నీరు కూడా అందడం లేదని పరిసర ప్రాంత రైతులు చెబుతున్నారు. కోటపల్లి ప్రాజెక్టుకు గతంలో ఏఈతో పాటు ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు, 15మంది గ్యాంగుమెన్‌లు ఉండేవారు. ప్రస్తుతం ఏఈ తప్ప ఎవరూ లేరు. వారందరూ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో సిబ్బంది కొరత ఏర్పడింది.

పట్టించుకోని పాలకులు

ప్రాజెక్టు కింద 9,200 ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువలు సక్రమంగా లేక, పూర్తి స్థాయిల్లో సిబ్బంది లేక వదిలిన సాగునీరు కాస్త.. వాగుల పాలవుతోంది. ఇదే విషయాన్ని పలుమార్లు చెబుతున్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాలువతో పాటు బేబి కాలువ ఉంది. ప్రభుత్వం గతంలో కాలువలకు, ఇతర పనులకు రూ. లక్షలు ఖర్చు పెట్టినా.. ఒక్క ఎకరా సాగు భూమి పెరగటం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ నికేష్‌ను వివరణ కోరగా.. కోటపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించామని చెప్పారు.

అధ్వానంగా కాలువలు

ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు అధ్వానంగా మారాయి. షటర్లు శిథిలావస్థకు చేరి, నీరు వృథాగా పోతోంది. ఎడమ కాలువలో చెట్లు పెరిగి సాగునీరు ముందుకు సాగటం లేదు. అనేక చోట్ల గండ్లు పడ్డాయి. గతంలో మరమ్మతుల పేరిట రూ. లక్షలు వెచ్చించినా.. ఫలితం లేదు. ప్రాజెక్టు నుంచి నీరు వదిలినా.. పొలాలకు నీరు వస్తుందన్న నమ్మకం లేదని రైతులు చెప్పారు. లెక్కల్లో మాత్రం అధికారులు 4వేల నుంచి 5వేల ఎకరాల వరకు సాగు నీరు అందుతున్నట్లు చూపుతున్నారు. వాస్తవానికి మూడు వేలకు మించడం లేదు. కనీసం మండలంలో కార్యాలయం లేదు. ఉన్న కార్యాలయం శిథిలావస్థకు చేరింది. దీంతో సంబంధిత అధికారులు పట్టణాలకు పరిమితమయ్యారు.

జైకా నిధుల జాడలేదు

గత ప్రభుత్వంలో జైకా నిధులు(జపాన్ దేశం నుంచి) రూ.20 కోట్లకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినా నేటి వరకు ఒక్క రుపాయి రాలేదు. కనీసం ప్రస్తుత ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరవుతాయనుకుంటే ప్రాజెక్టు గురించి ఎవరికీ పట్టదు. ప్రాజెక్టు పూర్తి స్థాయిల్లో నిండి చివరి భూములకు నీరు చేరుతే పెద్దేముల్, ధారూర్ మండలంలోని సుమారు 19గ్రామాల ప్రజలు ఎంతో సుఖసంతోషాలతో జీవిస్తారు. కానీ నీరందక 50శాతం ప్రజలు వలస బాట పట్టారు.

పోస్టులు భర్తీ చేయాలి



ప్రాజెక్టు సిబ్బంది ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. ఈ విషయాన్ని పలు మార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో 15మంది గ్యాంగుమెన్‌లు ఉండేవారు. ప్రస్తుతం ఒక్కరు కూడా లేరు. దీంతో ప్రాజెక్టు పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రాజెక్టులో నీరు ఎంత ఉంది. నీరు ఎప్పుడు వదులుతారని ఎవరిని అడగాలో అర్థం కావటం లేదు.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, పెద్దేముల్

నిధులు మంజూరు చేయండి



కోటపల్లి ప్రాజెక్టు వికారాబాద్ జిల్లాకే కాదు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తలమానికం. అలాంటి ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిధులు మంజూరు చేసి, చివరి ఆయకట్టు వరకు నీరు వచ్చేలా చేసి, వలస బాట పట్టిన రైతులు తిరిగి వచ్చేలా చేయాలి. అప్పుడే ప్రాజెక్టుకు, రైతులకు పూర్తి స్థాయిల్లో న్యాయం జరుగుతుంది. కొందరు రైతులు సాగునీరు అందక మెట్ట పంటలు సాగు చేస్తున్నారు.

– ముకుందరెడ్డి, రైతు, జనగాం

మణిపూర్ నిందితులను ఉరితీయాలి

దోమ: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడంతో పాటు, వారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితులను ఉరి తీయాలని అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకుడు అంజిరావన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పాలనలోకి వచ్చిన నాటి నుంచి దేశంలో కుల, మతాల గొడవలు జరుగుతూనే ఉన్నాయని, మహిళలను వివస్త్రగా మార్చి ఊరేగించిన ఘటన అత్యంత దారుణమని పేర్కొన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు.

దేశానికే సిగ్గుచేటు

కొడంగల్ రూరల్: సభ్యసమాజం తలదించుకునేలా పాల్పడినవారిని ఉరితీయాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. కుకి తెగకు చెందిన మహిళలను వివస్త్రగా మార్చి, వారిపై లైంగిక దాడికి పాల్పడం దేశానికే సిగ్గుచేటని మండిపడ్డారు. కేంద్రం జోక్యం చేసుకొని, బాధితులకు న్యాయం చేయాలన్నారు. నాయకులు సయ్యద్ ముస్తఫా, షేక్‌రోమన్, ఎండీ. ముర్తుజా, హుస్సేన్, రమేష్‌నాయక్ ఉన్నారు.

ఆరెన్నెళ్లన్నారు.. ఆరేళ్లయింది



పిల్లర్లకే పరిమితమైన వంతెన

పట్టించుకోని పాలకులు

- వంతెనను త్వరగా నిర్మించాలి: కాంగ్రెస్

ధారూరు: ఆరు నెలల్లో స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై వంతెన నిర్మించి, అందుబాటులోకి తెస్తామన్న అధికార పార్టీ బీఆర్‌ఎస్ నాయకులు.. ఆరేళ్లు గడుస్తున్నా.. దాని గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ ధారూరు మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష సాక్షిగా ఈ వంతనే నిలుస్తుందని చెప్పారు.

రవాణా బంద్

నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పక్కనే వేసిన తాత్కాలిక డైవర్షన్ రోడ్డుపై నుంచి ప్రస్తుత వర్షాలకు నీటి ప్రవాహం కొనసాగుతుందని, దీంతో రాకపోకలు స్తంభించిపోయాయని మండిపడ్డారు. నది ప్రవాహం వలన 50 గ్రామాలకు ధారూరుతో రవాణా సౌకర్యాలు బంద్ అయ్యాయని, ప్రజా ప్రతినిధులు ప్రజల అవస్థలను పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజల గురించి పట్టించుకొని, వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కల్వర్టుతో చింత తీరింది

హర్షం వ్యక్తచేస్తున్న తండావాసులు



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తండాల వాసులు

కొడంగల్ రూరల్: ‘గతంలో వర్షం వచ్చిందంటే భయం వేసేది. చిన్నపాటి వానలకే వాగు ఉధృతంగా ప్రవహించేది. ఇప్పుడు వాగుపై నిర్మించిన కల్వర్టుతో చింత తీరింది’ అని తండా వాసులు, సర్పంచ్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం కొడంగల్ మండలం పోచమ్మతండా, మైసమ్మ తండా వాసులు రెండు తండాల మధ్య నిర్మించిన కల్వర్టుకు పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. గతంలో వాగు ఉధృతికి ఓ వ్యక్తి కొట్టుకుపోయి మృతి చెందాడని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్నంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కాల్యానాయక్, పెంట్యానాయక్, పాండు, రాములు, భవన్‌నాయక్, చందర్ పాల్గొన్నారు.

‘భౌ’బోయ్

- కుక్కల స్వైర విహారం
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు



ధారూరు ప్రధాన రోడ్డులో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

ధారూరు: తాండూర్–హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ బాటసారులకు చుక్కలు చూపెడుతున్నాయి. రోడ్డుపై వెళ్తున్న ద్విచక్రవాహనదారులకు అకస్మాత్తుగా ఎదురుపడటం, అరుస్తూ వెంబడించడంతో బైకులు అదుపు తప్పి కిందపడి గాయాలకు గురికావడం షరా మామూలైంది. వీటి విషయంలో సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, పసిపిల్లల ప్రాణాలు తీస్తున్నా పటించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

క్రూర జంతువులుగా..

ఒకప్పుడు కుక్కలు ఎంతో విశ్వాసంగా ఉండేవని, ప్రస్తుతం క్రూర జంతువులుగా మారాయని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒంటరిగా కనబడితే చాలు దాడులకు తెగబడడంతో పాటు, ప్రాణాలు తీయటానికి వెనకాడటం లేదని వాపోతున్నారు. గ్రామాల్లో పెంపుడు కుక్కలు తక్కువగా ఉంటాయి. ఊర కుక్కలే అధికంగా ఉన్నాయి. ఒంటరిగా ఉన్న మేక, కోడి పిల్లలు కనబడితే చాలు చంపి తింటున్నాయి. లేగదూడలు కూడా వీటి బారిన పడుతున్నాయి. శునకాలకు భయపడి తమ పిల్లలను ఒంటరిగా పాఠశాలలకు పంపడం లేదంటే వాటి బెడద ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మేమేం చేస్తం..

ధారూరు మండల పరిధి గ్రామాల్లో గ్రామ సింహాల విహారం ఎక్కువగా ఉంది. వాటి నుంచి కాపాడాలని స్థానికులు సర్పంచుల దృష్టికి తీసుకెళ్లినా.. ‘మేమేం చేస్తం. పశువుల ఆసుపత్రి వారికి చెప్పాలి’ అని చెప్పి తప్పించుకుంటున్నారని వాపోవుతున్నారు. ఇదిలా ఉండగా.. కోళ్లఫారాల వద్ద కాపలదారులు లేకుంటే.. గుంపులుగా లోపలికి చొరబడి అందిన కోళ్లను తినేస్తున్నాయని యజమానులు వాపోతున్నారు. ఫాంలో చనిపోయిన కోళ్లను బయట పడేయడం వలనే.. వాటిని తింటూ కుక్కలు మాంసానికి అలవాటు పడి ఇలా దాడులు చేస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అంతే కాకుండా వ్యవసాయ పొలాల వద్ద ఒంటరిగా ఉన్న లేగదూడలను,మేకలపై దాడిచేసి, చంపి తినేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శునకాల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

టీడీపీ జాతీయ కార్యదర్శి వీరేశ్ ముదిరాజ్



పార్టీలో చేరిన వారితో వీరేశ్

కుల్కచర్ల: బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసేది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం నగరంలోని తన నివాసంలో చౌడాపూర్ మండలం చౌడాపూర్, వీరాపూర్, మందిపల్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలకు దేశం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.2కు కిలో బియ్యం మొదలు, పనికి ఆహార పథకం వంటి ఎన్నో పథకాలను తీసుకువచ్చి పేదల ఆకలిని తీర్చిన ఘనత నాటి టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగురవేసేవిధంగా కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్, రామస్వామి, బిచ్చయ్య, శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, మహేశ్, దస్తగిరి, గోరె పాష, జెట్టి నర్సింహులు, వెంకటేశ్, యాదయ్య, కేశవులు, రమేష్, మహేశ్, శేఖర్, మల్లేశ్, నరేష్, రవి, రామస్వామి, నర్సింహులు పాల్గొన్నారు.

నవీన్‌కుమార్‌కు ఎక్సలెన్స్ అవార్డు

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ మల్లెకేరి నవీన్‌కుమార్ సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. పాస్ట్‌ట్రాక్ ఎండీఆర్‌డీ హైదరాబాద్ వారు నిర్వహించిన 15 రోజుల ఆన్‌లైన్ శిక్షణలో పాల్గొని జీవిత బీమా రంగంలో ప్రతిభ చూపిన సందర్భంగా తనకు ఈ అవార్డు వరించిందని నవీన్‌కుమార్ తెలిపారు.

అందరి చూపు బీఆర్‌ఎస్ వైపే



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల వలన అందరి చూపు బీఆర్‌ఎస్ పార్టీ వైపు మళ్లిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టరు మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం మోమిన్‌పేట, చంద్రాయన్‌పల్లి, ఏన్కతల గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు.. అధికార పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ అంజయ్య, నాయకులు శ్రీరాంలు, రాంరెడ్డి, వేణు, చంద్రకాంత్, రాజు, మైపాల్, మైపాల్‌రెడ్డి, రమేష్, నగేశ్ తదితరులు ఉన్నారు.

రైతుబీమా.. కుటుంబానికి ధీమా

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

- చివరి గడువు ఆగస్టు 5
- వచ్చిన అర్జీలు 1,30,970
- రెన్యూవల్ అయినవి 20,825
- కొత్తగా నమోదైనవి 2,103



దాదాపూర్ రైతు వేదికలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓ చెన్నయ్య

దోమ: అన్నదాతలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. అర్హత కలిగిన రైతులకు బీమా చెల్లిస్తూ వారి కుటుంబానికి అండగా నిలుస్తోంది. బీమా కలిగిన రైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమా డబ్బులు బాధిత కుటుంబ సభ్యులకు నేరుగా అందించే విధంగా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా పాతవారితో పాటు.. కొత్తగా పట్టాలు పొందిన రైతుల నుంచి వివరాలు సేకరించి, ఇన్సూరెన్స్ వర్తింపజేసేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

అర్హులకే బీమా

జిల్లాలో ఇప్పటి వరకు 1,30,970 మంది రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేయగా.. అందులో 20,825 మందిని వ్యవసాయ అధికారులు రెన్యువల్ చేశారు. వారితో పాటు మరో 2,103 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో నూతన పట్టాదారు రైతులు 20 వేల వరకు ఉంటారని, మిగతా వారివి దరఖాస్తు చేస్తున్నామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల రైతులందరూ ఈ పథకానికి అర్హులని, వారందరూ అర్జీ పెట్టుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కావాల్సిన పత్రాలు

నూతనంగా పట్టాలు పొందిన రైతులు వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే ప్రారంభమైన ఈ ప్రక్రియ అగస్టు 5వ తేదీ లోపు అప్లికేషన్ పెట్టుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. కొత్తవారితో పాటు.. ఇప్పటి వరకు అర్జీ పెట్టుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అంతే కాకుండా నామినీ పేర్లు మార్చుకోవడానికి వెసులుబాటు కల్పించింది. దరఖాస్తుకు కావాల్సినవి ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ జిరాక్స్ కాపీలను ఆయా క్లస్టర్ల ఏఈఓలకు అందజేయాలి. వాటి ద్వారా ఏఈఓలు దరఖాస్తులను పూర్తి చేసి నెల రోజుల వ్యవధిలో బీమాకు సంబంధించిన పత్రాలను రైతులకు అందజేస్తారు.

పేదలకు ఎంతో ఉపయోగం



రైతుబీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగకరం. దీనిని ప్రతి రైతు వినియోగించుకోవాలి. కొత్తగా పట్టా పాసుపుస్తకం రావడం వలన.. రైతు వేదికకు వెళ్లి ఏఈఓ ద్వారా బీమాకు దరఖాస్తు చేసుకున్నాను. ప్రమాదవశాత్తు మరణిస్తే మా కుటుంబానికి ఎంతో అండగా నిలుస్తుంది.

– కోస్గి దస్తయ్య, రైతు, దాదాపూర్

దరఖాస్తు చేస్తున్నాం



కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన కర్షకులు.. రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నాం. ఇప్పటికే పలువురు అర్జీ పెట్టుకున్నారు. మిగతా వారు త్వరగా అప్లై చేసుకుంటే బీమా వర్తిస్తుంది. మీకు, మీకుటుంబీకులకు అండగా ఉంటుంది.

– చెన్నయ్య, ఏఈఓ, దాదాపూర్ క్లస్టర్

అర్హులకే అవకాశం



అర్హులైన రైతులకు బీమా వర్తిస్తుంది. రైతుబీమా కోసం కొత్తగా పట్టాలు పొందిన వారు తమ వివరాలను మండల వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలి. అర్జీకి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు చేసుకోవచ్చు.

– గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి

సంక్షేమం పట్టని సర్కారు

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

కొందుర్గు: ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తాను కొందుర్గు ఉమ్మడి మండలంలో పర్యటించానని, ఏ గ్రామానికి వెళ్లినా సరైన రోడ్లు లేవన్నారు. టేకుపల్లి, లాలపేట, గంగన్నగూడ, వెంకిర్యాల వంతెనలపై నుంచి వరదనీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడితే స్థానిక ఎమ్మెల్యే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. వాగుల్లో ప్రజలు వరదనీటిలో కొట్టుకుపోయి మృతిచెందిన పట్టించుకోరా అని ప్రశ్నించారు. మన ఊరు– మనబడి అని గొప్పలు చెప్పడం తప్పా చేసిందేమి లేదన్నారు. చాలా గ్రామాల్లో పాఠశాల భవనాలు శిథిలావస్థ చేరి కూలే స్థితికి చేరాయని వాపోయారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు కృష్ణా రెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, నరేందర్, గోవర్ధన్ గౌడ్, రమేష్, రవి, శ్రీనివాసు రెడ్డి, అమృతయ్య, పాల్గొన్నారు.

పనులు చేసుకుంటూ పోరాడండి

కొందుర్గు: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న జీపీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జిల్లేడ్ చౌదరిగూడ మండల కార్మికులు శంకర్ ఎదుట వాపోయారు. పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. శంకర్ స్పందిస్తూ ప్రస్తుతం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయడం అత్యవసరమని, పనులు చేసుకుంటూ ప్రభుత్వంపై పోరాటం చేయాలని సూచించారు. మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి రూ.10 వేలు అందజేశారు. అలాగే, చౌదరిగూడకు చెందిన రాములు ప్రమాదవశాత్తు కాలు విరగడంతో చికిత్స కోసం అతడి భార్య ఉమాదేవికి రూ.20 ఆర్థిక సాయం చేశారు.